

హుస్సేన్‌సాగర్‌లో 40వ హైదరాబాద్ సెయిలింగ్ వీక్‌తో పాటు దేశంలో తొలి ఐఎల్‌సీఏ ఓపెన్ ఇంటర్నేషనల్ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ పోటీలను ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్, సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. దేశ విదేశాల నుంచి వచ్చిన సెయిలర్లు, వివిధ సెయిలింగ్ క్లబ్‌ల ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు



హైదరాబాద్ వార్త

# బోనాల జాతరకు గోల్కొండ కోట ముస్తాబు



- 16నుంచి గోల్కొండ బోనాలు
- జగదాంబ మహంకాళి అమ్మవార్లకు తొలి బోనం, 9 రోజులు 9 పూజలు
- ఆధ్యాత్మిక వాతావరణంలో నెల రోజులపాటు బోనాల జాతర
- అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రులు

హైదరాబాద్ జులై 13, ప్రభాతవార్త :

**ఆషాడ మాస బోనాల ఉత్సవాలకు గోల్కొండ కోట ముస్తాబౌతుంది. చారిత్రాత్మకమైన గోల్కొండ కోట నుంచి బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతుండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలు ఈనెల 16న ప్రారంభమై నెల రోజులపాటు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతాయి. ఈ సందర్భంగా గోల్కొండ కోటపై కొలువుదిరిన శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి మట్టి కుండతో తొలి బోనంతో పాటు రాష్ట్ర ప్రభుత్వంచే అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ.**

**ఆధ్యాత్మిక వాతావరణంలో నెల రోజులపాటు బోనాల జాత**

ఆషాడమాస బోనాల ఉత్సవాలు నెల రోజులపాటు ఆధ్యాత్మిక వాతావరణంలో జరగనున్నాయి. కోటపై కొలువుదీరిన అమ్మవారికి తొమ్మిది రోజుల పాటు తొమ్మిది పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. ఈనెల 16న ప్రారంభమై ఆగస్టు 13న ముగిసే బోనాల ఉత్సవాలలో భక్తులు నగరం నలుమూలల నుంచే కాకుండా తెలంగాణలోని పలు జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాదిగా తరలివస్తారు.

**జగదాంబ మహంకాళి అమ్మవారికే తొలి బోనం**

గోల్కొండ కోటపై కొలువుదీరిన శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవార్లకే తొలి బోనం సమర్పిస్తారు. 28 కులవృత్తుల ఆధ్వర్యంలో అమ్మవార్లకు రెండు పచ్చి కుండల్లో నజర్ బోనాలను తయారు చేసి ఒకటి జగదాంబ అమ్మవారికి, మరొకటి మహంకాళి అమ్మవారికి సమర్పించడం ఆనవాయితీ. లంగర్ హౌస్ చౌరస్తా వద్ద భారీ తొట్టెలకు రాష్ట్ర మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించి దేవాదాయ శాఖ తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. భారీ తొట్టెల ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, కళాకారుల ఆటపాటలతో బడా బజార్, రిసాల బజార్ మీదుగా అమ్మవార్ల వద్దకు చేరుకొని నజర్ బోనాలను, పట్టు వస్త్రాలను సమర్పిస్తారు.

**తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బోనాల ఉత్సవాలు**

**చైర్మన్ ఆకుల చంద్రశేఖర్**

తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా బోనాల ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఆషాడ మాస బోనాల ఉత్సవాలు చారిత్రాత్మకమైన గోల్కొండ కోట నుంచే ప్రారంభమవుతుండడం ఆనవాయితీగా వస్తుంది. ఈనెల 16న ప్రారంభమయ్యే గోల్కొండ బోనాల ఉత్సవాలలో రాష్ట్ర మంత్రులు పాల్గొని భారీ తొట్టెలకు ప్రత్యేక పూజలు, అమ్మవార్లకు నజర్ బోనాలు, పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. ఈ ఉత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



గోల్కొండ కోటపై కొలువుదీరిన అమ్మవారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత వేగవంతం

**-ఈఆర్ఓ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు**

**-జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా**

హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త: జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ఆదేశించారు. సోమవారం బహదూర్‌పుర కిషన్ బాగ్‌లో గల కమ్యూనిటీ హాల్ నందు ఎన్యుమరేషన్ పత్రాలు స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన ఐదు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించి బిఎల్ఓలకు పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్‌ల వారీగా ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ వేగవంతంగా కొనసాగాలని, ఈనెల 24వ తేదీ చివరి రోజు ఉన్నందున ఓటర్లు ప్రత్యేక శ్రద్ధ చూపి ఎన్యుమరేషన్ ఫారాలు నింపి ఆయా కేంద్రాలలో బిఎల్ఓలకు అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రజల సమస్యల నివృత్తికై ఆయా నియోజకవర్గాల్లోని ఈఆర్ఓ కార్యాలయాల్లో హెల్ప్ డెస్కు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా బిఎల్వోలు ఇంటింటికి వచ్చి ఫారాలు అందజేయడం జరిగిందని, ప్రజలు ఎన్యుమరేషన్ ఫామ్ తప్పులు లేకుండా నమోదు చేయాలని అన్నారు. బిఎల్‌వోలు యాప్ ద్వారా ప్రస్తుత అడ్రస్‌లు , ఇండ్లలో అర్హులైన వారి వివరాలు పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో బహదూర్ పుర తాసిల్దార్, బాల శంకర్, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ అరుణ కుమారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కిషన్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన ఎన్యూరేషన్ పత్రాల స్వీకరణ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

**బస్తీ దవాఖానాల్లో మెరుగైన సేవలు అందాలి**

జిల్లాలోని బస్తీ దవాఖానల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం బహదూర్ పుర మండలంలోని కిషన్ బాగ్ లోగల బస్తీ దవాఖానను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డ్స్ ను, మందుల నిల్వ, టెస్టుల వివరాలు, ఇంటింటి ఫీవర్ సర్వే , క్లస్టర్ లో చేపట్టే వైద్య కార్యక్రమాలు, సిబ్బంది వివరాలు అలాగే ఆన్లైన్ నమోదు వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని బస్తీ దవాఖాన లలో ఎక్కడ కూడా మందులు కొరత లేకుండా అలాగే వైద్యాధికారులు సిబ్బంది సమయపాలన పాటించాలని ఆమె ఆదేశించారు. ముఖ్యంగా ఇంటింటి ఫీవర్ సర్వే ద్వారా రోగులను గుర్తించి టెస్టులు అనంతరం మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. తదుపరి ఆసుపత్రిలోని రోగులతో మాట్లాడుతూ వైద్య సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. వచ్చే రోగులకు తమ తమ ప్రాంతంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మొహమ్మద్ తౌఫిక్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ' ఫైర్ ఎన్‌వోసీ'లు ఇక ఆన్‌లైన్‌లో...

**దరఖాస్తుల స్వీకరణ...జారీ అంతా అక్కడే**

**సేవలను ప్రారంభించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్**



సేవలను ప్రారంభిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, జులై 13,ప్రభాతవార్త: ఫైర్ ఎన్‌ఓసీతో పాటు రెన్యూవల్స్ ఆన్‌లైన్లోనే జారీ చేసే ప్రక్రియకు హైడ్రా సోమవారం శ్రీకారం చుట్టింది. ఆన్‌లైన్లోనే దరఖాస్తుల స్వీకరణ, అనుమతుల మంజూరీ, పాత అనుమతుల పునరుద్ధరణ, వాటికి సంబంధించిన ఫీజుల చెల్లింపులు.. ఇలా అన్నీ ఆన్‌లైన్లోనే జరిగేలా చర్యలు తీసుకుంది. ఈ ఆన్‌లైన్ సేవల ప్రక్రియను హైడ్రా కమిషనర్ రంగనాథ్ సోమవారం ప్రారంభించారు. హైడ్రా ఫైర్ విభాగం అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, ఆర్ ఎఫ్ ఓ జయప్రకాష్, డీఎఫ్‌వోలువై. గౌతం, ఎస్.శ్రీధర్ రెడ్డి, ఐటీ విభాగం ఇన్‌ఛార్జి బాచిరెడ్డి ఈ కార్యక్రమంలో ఉన్నారు. వెబ్‌సైట్‌లోకి వెళ్లి అందులోనే నేరుగా సంబంధిత కాలమ్స్‌లో అడిగిన సమాచారం అందజేస్తే సరిపోతుందని హైడ్రా ఒక ప్రకటనలో పేర్కొంది. నాన్ హై రైజ్ బిల్డింగ్స్‌కు ఫైర్ ఎన్‌వోసీలతో పాటు.. వాటి రెన్యూవల్స్‌ను గతంలో జీహెచ్ ఎంసీ పరిధి వరకూ హైడ్రా జారీ చేస్తూ వచ్చేది. ఇప్పుడు గ్రేటర్‌హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)ఇలా క్యూర్ (కోర్ అర్బన్ రీజయన్ ఎకానమీ) పరిధిలోని మూడు కార్పొరేషన్లకు హైడ్రా సేవలను రాష్ట్ర ప్రభుత్వం విస్తరించింది. హైడ్రా కార్యాలయం వరకూ ఎవరూ రావాల్సిన పని లేదని పేర్కొంది. ఫైర్ ఎన్‌వోసీతో పాటు, రెన్యూవల్స్‌కు సంబంధించిన దరఖాస్తును ఆన్‌లైన్లో నింపడంతో పాటు.. సంబంధిత పత్రాలను కూడా ఆన్‌లైన్లోనే అప్‌లోడ్ చేయాల్సి ఉందని హైడ్రా తెలిపింది. దరఖాస్తుదారుడు ఆన్‌లైన్లో అందజేసిన సమాచారం ప్రకారం ఫైర్ నిబంధనలను పాటించారా లేదా అనేది సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని హైడ్రా పేర్కొంది. తర్వాత అనుమతులు మంజూరూ చేస్తూ ధ్రువపత్రాలను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేస్తుంది. వాటిని దరఖాస్తు దారులు ఆన్‌లైన్లోనే డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు హైడ్రా కల్పించింది.

### రూ. 16లక్షల విలువైన హష్ ఆయిల్ పట్టివేత

**జూబ్లీహిల్స్, జులై 13, ప్రభాతవార్త:** హష్ ఆయిల్ విక్రయిస్తున్న ముగ్గురితోపాటు వినియోగించడానికి వచ్చిన ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 16లక్షల విలువైన 1.250 లీటర్ల హష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకసున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు జూబ్లీహిల్స్ పోలీసులతో కలిసి రోడ్ నంబరు 10లో మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ముగ్గురితోపాటు ఇద్దరు వినియోగదారులను అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి 1.250 లీటర్ల హష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో రవాణాదారు అయిన ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన బొనాంగి చిన్నయ్యపడాల్(24), గతంలో 18 కేసుల్లో పాత నేరస్థుడు అయిన జనగామా జిల్లాకు చెంది జగద్గిరిగుట్టకు చెందిన పడమటింటి భరత్‌కుమార్(23), జూబ్లీహిల్స్‌కు చెందిన విద్యార్థి మహమ్మద్ షోయబ్(20)లు ఈ హష్ ఆయిల్‌ను అవసరమైన వారికి విక్రయిస్తున్నారు.

## బాబానగర్‌లో కమిషనర్ క్షేత్రస్థాయి తనిఖీ

**-పరిశుభ్రత, దోమల నివారణ, పచ్చదనంపై అధికారులకు కీలక ఆదేశాలు**



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్, జులై 13 ప్రభాతవార్త : మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో తనిఖీలను మరింత విస్తృతం చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. నాచారం పరిధిలోని బాబానగర్ వార్డులో సోమవారం నిర్వహించిన తనిఖీలో పారిశుద్ధం, పచ్చ దనం, దోమల నివారణ చర్యలు, వ్యర్థాల నిర్వహణ, వాణిజ్య అనుమతుల అమలు ను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. దోమలు వ్యాప్తి చెందే ప్రాంతాలను గుర్తించి వెంటనే నిర్మూలించాలని, లార్వా నివారణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. మొక్కలు లేక నిరక్ష్యంగా ఉన్న లేదా ఆక్రమణకు గురైన మొక్కల తొట్టెలను తొలగించి, అవసరమైన చోట కొత్త మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని ఆదేశించారు. మొక్కల సంరక్షణపై స్థానిక ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

**ప్రజావాణిలో 29 వినతులు**

సమస్యలను వేగంగా పరిష్కరించడమే లక్ష్యంగా మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి, సంబంధిత శాఖలకు పంపించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 29 వినతులు అందాయి. ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, ఆలస్యం లేకుండా పరిష్కరించేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

## నేత్రపర్వంగా ముగిసిన ప్రజాకళ సాంస్కృతిక మహోత్సవం




పలు సీడిలను ఆవిష్కరిస్తున్న వాణీప్రసాద్, నరసింహారెడ్డి, వెన్నెల, హేమలతారెడ్డి తదితర అతిథులు

రవీంద్రభారతి, జులై 13 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రాంగణంలో ప్రతిష్టాత్మక (ఘంటసాల) పాల్కురికి సోమన్న కళావేదికలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి నేతృత్వంలో 101రోజుల పాటు వివిధ కళారూపాల అద్భుత ప్రదర్శనలతో కొనసాగిన సాంస్కృతిక కళామహోత్సవం తెలంగాణ ప్రజాకళ నేత్రపర్వంగా ముగిసింది. ముగింపు వేడుకల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ, జానపద కళారూపాల సజీవరూపాన్ని కళ్లకింపుగా ఆవిష్కరించి తన్మయుల్ని చేశారు. ముఖ్యంగా గుస్సాడి, చిందుయక్షగానం, ఒగ్గుడోలు, స్త్రీ పురుషుల డప్పుడోలు విన్యాసాలు, బంజారా, బోనాలు, కోలాటంలతోపాటు శాస్త్రీయ, జానపద నృత్యాలతో, సామాజిక చైతన్య, సంక్షేమ పథకాల గీతాలతో వేదిక దద్దరిల్లిపోయింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సాంస్కృతిక, పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీప్రసాద్ ఎక్కడైతే కళలు కళాకారులు గౌరవించబడతారో అక్కడ రాజ్యం సుభిక్షం, సురక్షితంగా ఉజ్వరిల్లుతుందని స్పష్టం చేశారు. సమాజానికి శాశ్వతశక్తి, స్ఫూర్తినిచ్చే కళలను, కళాకారులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదరిస్తుందని ఆమె భరోసానిచ్చారు. ఈ సందర్భంగా వాణీప్రసాద్ విశిష్ట అతిథులు డా. ఏనుగు నరసిం హారెడ్డి, డా. జి.వి.వెన్నెల, విజయకుమార్, తెలుగు విశ్వవిద్యాలయ పిఆర్‌ఓ శ్రీనివాస్ గౌడ్, ఆకుల రవికుమార్, శ్రీనివాస్, దినకర్, హేమలత తదితరులతో కలిసి ప్రజాకవి త పుస్తకాన్ని; భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి రచించిన హైదరాబాద్ చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని ఆవిష్కరించే గాయకుడు విద్యానందచారి ఆలపించిన ముద్దొచ్చే ముద్దొచ్చే హైదరాబాద్ సిడీని; ప్రభుత్వ ప్రభాతభేరి కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజల్లో చైతన్యం కల్పించే విద్యానందచారి రచించి ఆలపించిన మత్తులోన మునగకురా మాయదారి మల్లిగా సామాజిక చైతన్య గీతం సీడిని ఆవిష్కరించి రచయితలను ఘనంగా సత్కరించి అభినందించారు.

# ఎల్బీనగర్ కాంగ్రెస్‌లో మాటల మంటలు

- -బిసిలను కించపరిచిన జక్కిడిని సస్పెండ్ చేయాలి : బిసి సంఘాలు..
- -తాను కాదు..ఏఐ మార్ఫింగ్ ..కట్టె కాలే వరకు కాంగ్రెస్‌తోనే: జక్కిడి
- -జక్కిడి ఇంటిపై రాళ్ల దాడి.. పోలీసుల లాఠీ ఛార్జ్



విజయవాడ హైవే పై ఆందోళన చేస్తున్న బీసీ సంఘాల నాయకులు.



విలేకరులతో మాట్లాడుతున్న జక్కిడి శివ చరణ్ రెడ్డి

మన్సూరాబాద్, జులై 13, ప్రభాతవార్త: గతంలో ఫ్లెక్సీలో ఫోటో లేకపోవడంతో మొదలైన మాటల యుద్ధం తో పాటు రెండు రోజుల క్రితం స్టేట్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి యాదాద్రి టెంపుల్ డైరెక్టర్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ పై అసభ్య అనుచిత వ్యాఖ్యల ఆడియో బహిర్గతం కావడంతో ఎల్బీ నగర్ కాంగ్రెస్‌లో ఒక్కసారిగా విభేదాలు భగ్గుమన్నాయి. ఈ ఆడియో టేపుల నేపథ్యములో ఈశ్వరమ్మయాదవ్ పై జక్కిడి చేసిన మాటల యుద్ధంతో ఒక్కసారిగా బీసీ సంఘాలు, ఈశ్వరమ్మ మద్దతు దారులు మన్సూరాబాద్ లోని జక్కిడి చరణ్ ఇంటీని ముట్టడించారు. ఈ క్రమం లో జక్కిడి చరణ్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ చరణ్ ఇంటి పై రాళ్లు కర్రలతో దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటన కు వెంటనే చరణ్ మద్దతు దారులు సైతం ప్రతి దాడులు చేసారు. సుమారు గంట సేపు మన్సూరాబాద్ లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగా ముందస్తు గా ఎల్బీ నగర్, వనస్థలిపురం ఏసీపీ లు కృష్ణయ్యగౌడ్, కాశి రెడ్డి లు మరియు సీఐ లు పోలీస్ ల బలగాలతో ఉండడంతో లాఠీ లకు పని చెప్పి ఇరు వర్గాల వారిని చెదరగొట్టారు. సుమారు గంట సేపు జక్కిడి ఇంటి వద్ద ఆందోళన చోటు చేసుకుంది. పోలీస్‌లు ఇరు వర్గాల వారిని సముదాయించి ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టారు. ఏ ఐ తో మార్ఫింగ్.. కట్టే కాలే వరకు కాంగ్రెస్ తోనే..: జక్కిడి కాగా ఈశ్వరమ్మ యాదవ్ పై వచ్చిన ఆడియో తనకు సంబంధం లేదని, ఇది పూర్తిగా ఏ ఐ మార్ఫింగ్ అని శివ చరణ్ తెలిపారు. ఎల్బీ నగర్ లో ఇంటి పై దాడులు ఇంత వరకు జరగలేదని దీని వెనక బీఆర్ఎస్ నాయకుల కుట్ర ఉందని ఆరోపించారు. తన తండ్రి గత 30 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీ లో నే ఉన్నారని, పదవులు రాకుంటే ఒకలాగా వస్తే మరోలాగా ఉండమని స్పష్టం చేశారు. ఎల్బీ నగర్ లో నాయకత్వ లోపం కనిపిస్తున్నది అని, ఇలాంటి గొడవలకు ఆద్యం పోయడం లో ముందు ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము చనిపోయిన తమ శరీరాలపై కాంగ్రెస్ జెండా ఉంటుందని అన్నారు. ఆడియో మార్ఫింగ్ లపై ఆదివారం ఎల్బీ నగర్ పోలీసు లకు తమ మద్దతు దారులు పిర్యాదు కూడా చేయడం జరిగిందని తెలిపారు. ఎల్బీ నగర్ లో కాంగ్రెస్ పార్టీ నీ కాపాడుకుంటామని అన్నారు. ఈ ఘటనపై తాను పార్టీ పెద్దలకు పిర్యాదు చేస్తామని జక్కిడి తెలిపారు. జక్కిడిని సస్పెండ్ చేయాలి: బీసీ సంఘాలు..ఈశ్వరమ్మ యాదవ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివ చరణ్ ను వెంటనే పార్టీ నుండి సస్పెండ్ చేయాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అంతకు ముందు ఉదయం ఈ ఘటనకు సంబంధంచి చింతలకుంట లో బీసీ సంఘాల నాయకులు ఈశ్వరమ్మ కు మద్దతు తెలిపి అగ్రకుల నాయకులు చేస్తున్న తప్పిదాలను ఎత్తి చూపారు. చరణ్ రెడ్డి వెంటనే ఈశ్వరమ్మ కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ విజయ వాడ జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా చరణ్ రెడ్డి కి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జక్కిడి ప్రభాకర్ రెడ్డి మరియు చరణ్ రెడ్డి లా దిష్టి బొమ్మలను దగ్ధం చేసి నిరసన చేపట్టారు. దీంతో సుమారు గంట సేపు రహదారిపై భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. దీంతో పోలీసులు వచ్చి సర్ది చెప్పడంతో ఆందోళన విరమించి అక్కడి నుండి జక్కిడి ఇంటి ముట్టడికి బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయాల్లో బీసీ లు కావాలి కానీ తమ కులాల వారికి పదవులు వస్తే మాత్రం అగ్రకుల నాయకులు ఓర్వలేక పోతుండడం సిగ్గు చేటని ధ్వజమెత్తారు. ఒక బీసీ కులానికి చెందిన పెద్దమనిషిని పట్టుకొని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇలా మాట్లాడడం దిగజారుడు తనానికి అహంకారానికి నిదర్శన మని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వాళ్లకు బీసీ ల మద్దతు కావాలంటే వెంటనే చరణ్ రెడ్డి ని సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా పలువురు బీసీ సంఘాల నాయకులు ఈశ్వరమ్మ యాదవ్ పై చేసిన అసంబద్ధ వ్యాఖ్యలను పూర్తిగా ఖండించి తమ సంపూర్ణ మద్దతు ను తెలిపారు. ఈ కార్యక్రములో బీసీ సంఘాల నాయకులు బొంతు శ్రీదేవి,రవీంద్ర నాథ్ యాదవ్, లలితయాదవ్, డాక్టర్ మేకల రాములు, జగదీష్ యాదవ్, వేములయ్య గౌడ్, జగదీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : సిఎంసి కమిషనర్ సృజన



పిర్యాదులు స్వీకరిస్తున్న సిఎంసి కమిషనర్ జి.సృజన

**హైదరాబాద్,జులై 13,ప్రభాతవార్త:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సిఎంసి కమిషనర్ జి.సృజన తెలిపా రు. ఈమేరకు సోమవారం సిఎంసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సైబరాబాద్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పాల్గొని తమ సమస్యలు, ఫిర్యాదులను కమిషనర్ వివిధ విభాగాల ఉన్నతాధికారుల దృష్టికి నేరుగా తీసుకువచ్చారు. వీటిలో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 51, ఇంజినీరింగ్‌కు 8, శానిటేషన్‌కు 2, అర్బన్ బయోడైవర్సిటీకి 2, ఎలక్ట్రికల్, రెవెన్యూ (ప్రాపర్టీ ట్యాక్స్), ఎన్నికల విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు.. అందాయి. కమిషనర్ ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమ స్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ప్రస్తావించిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, సకాలంలో తదుపరి చర్యలు చేపట్టాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. పారదర్శకత, జవాబుదారీతనాన్ని మరింత పెంపొందించేందుకు ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక గ్రీవెన్స్ ఐడీ, ట్రాకింగ్ లింక్.. కేటాయించారు. దీని ద్వారా ప్రజలు తమ ఫిర్యాదు స్థితిని స్వయంగా తెలుసుకునే అవకాశం కల్పించారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు తమ పౌర సమస్యలను నేరుగా కార్పొరేషన్ దృష్టికి తీసుకురావడానికి అవకాశం కలుగుతుందని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులకు తగిన ప్రాధాన్యతనిస్తూ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ కృషి : రమేష్ నాయక్



దావత్ కే గూంజ్ - విద్యార్థి గర్జన కార్యక్రమంలో పాల్గొన్న రమేష్ నాయక్

**సంజీవరెడ్డి నగర్, జూలై 13, ప్రభాతవార్త:** విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని ఆదివాసీ కాంగ్రెస్-సికింద్రాబాద్ జిల్లా (డీసీసీ) అధ్యక్షుడు రమేష్ నాయక్ అన్నారు. సోమవారం సంజీవరెడ్డి నగర్‌లోని శ్రీ సూర్య జూనియర్ కాలేజీలో ఆయన ఆధ్వర్యంలో "దావత్ కే గూంజ్ - విద్యార్థి గర్జన" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ విద్యార్థులతో ముఖాముఖి సమావేశమై వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు, పోటీ పరీక్షల నిర్వహణ, నిరుద్యోగం, ఉన్నత విద్య అవకాశాలపై విద్యార్థులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా రమేష్ నాయక్ మాట్లాడుతూ నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ ఘటనలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్య హక్కు, ఉద్యోగ హక్కు, యువతకు హక్కు అనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల తరఫున పోరాటం కొనసాగిస్తుందని, వారి భవిష్యత్తు కోసం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నగర కాంగ్రెస్ నాయకులు మహేష్ కుసుల, రవి గౌడ్, మండల నరేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు శశి, గౌస్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

### రైజింగ్ తెలంగాణ సీఎస్ఆర్ అవార్డ్స్‌కు సంజయ్ జాజుకు ఆహ్వానం



రైజింగ్ తెలంగాణ సీఎస్ఆర్ అవార్డ్స్ కార్యక్రమానికి సంజయ్ జాజును ఆహ్వానిసుతున్న నారీ నిర్మాణ్ ప్రతినిధి బృందం

**ముషీరాబాద్, జూలై 13, ప్రభాతవార్త:** రైజింగ్ తెలంగాణ సీఎస్ఆర్ అవార్డ్స్-2026కు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈమేరకు సోమవారం నారీ నిర్మాణ్ ఫౌండర్ చైర్మన్ మాదిరెడ్డి జగన్నాధం నారీ నిర్మాణ్ ప్రతినిధి బృందంతో కలిసి సంజయ్ జాజును కలిసి రైజింగ్ తెలంగాణ సీఎస్ఆర్ అవార్డ్స్-2026 కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా నారి నిర్మాణ్ సంస్థ చేపడుతున్న సామాజిక, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. తెలంగాణలో సామాజిక బాధ్యత రంగంలో విశిష్ట సేవలందిస్తున్న సంస్థలు, పారిశ్రామిక వేత్తలు, సామాజిక సేవకులను ఒకే వేదికపై సత్కరించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నారి నిర్మాణ్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను సంజయ్‌జాజు అభినందించి, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వర్‌గౌడ్, హార్యాన్ మీడియా మేనేజింగ్ డైరెక్టర్ పవిత్ర మాధిరెడ్డి, నారి నిర్మాణ్ మేనేజింగ్ డైరెక్టర్ పవన్‌కుమార్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### గోపాల్ రావుని సన్మానించిన రామచందర్ రావు...



గోపాలరావు సన్మానిస్తున్న రామచంద్రరావు

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 13, ప్రభాతవార్త:** వివేకానంద నగర్ డివిజన్ భాగం బీర్ బీజేపి కార్యాలయం పున: ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రామ్ చందర్ రావు ఇటీవలే రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధికార ప్రతినిధిగా నియమితులైన ఏ గోపాల్ రావుని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపి పార్టీని బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో విజయాన్ని కృషి చేయాలని ఈ సందర్భంగా రామచంద్రరావు సూచించారు.

### సర్‌ను విజయవంతం చేయడంలో ప్రతి నాయకుడు బాధ్యతగా వ్యవహరించాలి : బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 13, ప్రభాతవార్త:** కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి నాయకుడు బాధ్యతగా వ్యవహరించాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్ పిలుపునిచ్చారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమంపై కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులతో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ వారీగా బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్‌ఏ) పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలని, ఇంటింటికీ ఓటర్ ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ ప్రక్రియపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, అర్హులైన ప్రతి ఓటరుకు ఫారం అందేలా బ్లాక్, డివిజన్ అధ్యక్షులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా కృషి చేయాలని బండి రమేష్ సూచించారు.

### అసోసియేషన్ సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే కృష్ణారావు



ఎమ్మెల్యే కృష్ణారావును సన్మానిస్తున్న పిఎస్ఆర్కే భగవాన్

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 13, ప్రభాతవార్త:** కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానంద నగర్‌లోని గల వడ్డేపల్లి ఎంక్లేవ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులను మాధవరం కృష్ణారావు అభినందించారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం అధ్యక్షులు పిఎస్ఆర్కే భగవాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాపార రంగంలో రాణిస్తూ సంక్షేమ కోసం నిరంతరం పాటుపడుతున్న పిఎస్ఆర్కే భగవాన్ రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నుకోవడం అభినందనీయమని అన్నారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న ఆయనకు ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని కృష్ణారావు సూచించారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదిక విందులో కృష్ణారావుతోపాటు మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, వడ్డేపల్లి ఎన్క్లేవ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఇతర నాయకులు పాల్గొన్నారు.

### ఎస్ఐఆర్ ప్రక్రియను సాఫీగా సాగేందుకు బిఆర్ఎస్ నేతలు సహకరించాలి : ఎమ్మెల్యే పద్మారావుగౌడ్



ఓటర్‌లకు ఎన్యూమరేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

**సికింద్రాబాద్, జూలై 13 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ పరిధిలో ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను సాఫీగా నిర్వర్తించేందుకు బీ. ఎల్.ఏ.లు అధికారిక బీ.ఎల్.ఓ.లతో సమన్వయం ఏర్పరుచుకొని వెంటనే కచ్చితంగా తమ పోలింగ్ బూత్‌ల పరిధుల్లోని ఎన్యూమరేషన్ పత్రాలను పూర్తి చేసి వెంటనే దాఖలు చేయాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ సూచించారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో సీతాఫలమండీ, అక్బర్ హోటల్, మహమ్మద్ గూడా నాలా, మధురానగర్ ప్రాంతాల్లో పద్మారావు గౌడ్ సోమవారం పర్యటించి ఎస్. ఐ. ఆర్. ధరఖాస్తుల కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ స్థానిక శ్రేణుల ద్వారా ప్రజలకు ఉపకరించేలా దరఖాస్తుల పూర్తికి ఏర్పాట్లు జరిపుతున్నామని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పద్మారావు గౌడ్ సూచించారు. బి.ఎల్.ఓ.లు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని, తద్వారా అర్హులైన ఎవ్వరి ఓట్లు పోకుండా జాగ్రత్త పడాలని, సీతాఫలమండీ లోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను వినియోగించుకొని ఎన్యూమరేషన్ పత్రాలు పూరించడంలో సహాయం తీసుకోవచ్చునని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ సామాల హేమ ఇతర నాయకులు పాల్గొన్నారు

**ఎల్ఓసి పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్**

లాలాపేట ప్రాంతానికి చెందిన కాగితాల వెంకటా చారి, లాలాగూడ కు చెందిన విజయ కుమార్ తీవ్ర అనారోగ్యానికి గురై తగిన సాయనికై సీతాఫలమండీ లోని సికింద్రాబాద్ నియోజకవర్గ ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించారు. వెంటనే స్పందించిన స్థానిక శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ తమ కార్యాలయం ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స ను నిర్వహించేందుకు వీలుగా రూ.నాలుగు లక్షల చొప్పున విలువ జేసె మంజూరు పత్రాలను సమకూర్చారు. ఈ ఎల్.ఓ.సీ. పత్రాలను పద్మారావు గౌడ్ సోమవారం సీతాఫలమండీ లోని తమ కార్యాలయంలో వెంకటాచారి, విజయ్ కుమార్‌లకు అందించారు.

## కనీస వేతనాలను వెంటనే అమలు చేయాలి : సీఐటీయూ



సమావేశంలో ప్రసంగిస్తున్న సిఐటియు, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్

**నిజాంపేట్, జూలై 13, ప్రభాతవార్త** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని అన్ని పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ప్రగతి నగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. అశోక్ మాట్లాడారు. జిల్లాలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, వేతనంతో కూడిన సెలవులు, భద్రతా పరికరాలు తదితర చట్టబద్ధమైన అన్ని సంక్షేమ సౌకర్యాలను యాజమాన్యాలు తప్పనిసరిగా కల్పించాలని ఆయన కోరారు. ప్రస్తుతం ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు లేకుండా పనిచేస్తున్న కార్మికులను వెంటనే ఆయా పథకాల పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు, చట్టబద్ధమైన హక్కుల కోసం ప్రశ్నించే కార్మికులను యాజమాన్యాలు బెదిరించడం, వేధించడం, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించడం వంటి చర్యలను ప్రభుత్వం వెంటనే అరికట్టాలని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్-6ను జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పారిశ్రామిక ప్రాంతాల్లో ఎలాంటి మినహాయింపులు లేకుండా కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న పరిశ్రమల యాజమాన్యాలపై కార్మిక శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ వెంకట రామయ్య, మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకట్రాజ్యం, జిల్లా సహాయ కార్యదర్శి లింగస్వామి, జిల్లా కమిటీ సభ్యుడు రాథోడ్ సంతోష్, మండల నాయకులు నాగభూషణ్, స్వామి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

**నిజాంపేట్, జూలై 13, ప్రభాతవార్త** చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల నేపథ్యంలో నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బాచుపల్లి పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు తెలిపారు. 11 కేవీ సాయి మల్లంపేట్, ఏసీ టైర్స్, శ్రీ హోమ్స్, ప్రణీత్, రిసీనియా, గోతిక్ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్నందున ఈ విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కారణంగా కేఆర్‌సీఆర్ హరిత వనం కాలనీ, బ్లాక్ డైమండ్ కాలనీ, కేవీఆర్ రెయిన్‌బో కాలనీ, శ్రీ హోమ్స్, నందన వనం కాలనీ, గోతిక్, రిసీనియా, ప్రణీత్ అంటిల్లా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకుని టీజీఎస్‌పీడీసీఎల్‌కు సహకరించాలని బాచుపల్లి విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ ఎ. శశిధర్ విజ్ఞప్తి చేశారు. నిర్వహణ పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు వెల్లడించారు.

**నిజాంపేట్ పరిధిలో**

నేడు నిజాంపేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు వెల్లడించారు. ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు 11 కేవీ వజ్ర నిర్మాణ్ మరియు వజ్ర నిర్మాణ్-2 ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్నారు. ఈ సమయంలో వజ్ర ప్రతీక్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. అలాగే ఉదయం 10:30 గంటల నుంచి 11:00 గంటల వరకు 11 కేవీ న్యూ శ్రీనివాస కాలనీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు నిర్వహించనున్నందున సర్వే నంబర్-191, ఎన్టీఆర్ నగర్, శ్రీనివాస కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు 11 కేవీ పాండురంగ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్నారు. ఈ సమయంలో రెడ్డి అవెన్యూ, జర్నలిస్టు కాలనీ, సిరి బాలాజీ టవర్స్, ఆదిత్య లగూన్, రిసీనియా బిల్డర్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. నిర్వహణ పనులు పూర్తయ్యే వరకు వినియోగదారులు సహకరించాలని, అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని నిజాంపేట్ విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ (ఏఈ) విజ్ఞప్తి చేశారు.

**బేగంబజార్ సిబిడి పరిధిలో**

బేగంబజార్, జూలై 12 ప్రభాతవార్త: బేగంబజార్ సిబిడి పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల కారణంగామంగళవారం 11 కెవి విద్యుత్ ఫీడర్లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బేగంబజార్ డివిజనల్ఇంజనీర్ అన్నయ్య తెలిపారు. 11 కె.వి.సీతారాంబాగ్, ఆసిఫ్‌నగర్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా ఉదయం 9గంటల 30నిమిషాల నుంచి మధ్యాహ్నం 12గంటల 30 నిమిషాల వరకు గుఫానగర్, ఇందిరానగర్, ద్రౌపదిగార్డెన్, ఫ్రెండ్స్ కేఫ్, ఎం.బస్తీ, అఫ్జల్‌సాగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. 11 కెవి గోశాల, నల్లపోచమ్మ విద్యుత్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా మధ్యాహ్నం 2గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 5గంటల 30 నిమిషాల వరకు శివాజీ విగ్రహం, హాతిబౌలి, పోలీస్‌క్వార్టర్స్, ఇమామ్‌పురా, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బేగంబజార్ డివిజనల్ ఇంజనీర్ అన్నయ్య తెలిపారు.

### మన సంస్కృతీ సంప్రదాయాలను నేటి తరమే ముందుకు తీసుకెళ్లాలి : కొల్లేటి దామోదర్ గుప్తా





త్యాగరాయ గానసభలో కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కొల్లేటి దామోదర్ గుప్తా తదితరులు

**చిక్కడపల్లి జులై 13 ( ప్రభాతవార్త ) :** చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై భాగ్యనగర ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. కరీంనగర్ జిల్లాకు చెందిన లంబోదర కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో "హలో హైదరాబాద్" పేరిట ఈ వేడుకలను నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో పలు ప్రాంతాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన అన్ని వయసుల వారైన 300 మందికి పైగా కళాకారులు పాల్గొని తమ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను కనువిందు చేశారు. కార్యక్రమానికి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక మాధ్యమాల ప్రభావం వల్ల నేటి తరానికి మన కళలు, సాహిత్యంపై ఆసక్తి తగ్గిందని భావిస్తామని, కానీ ఇక్కడి బాల, యువ కళాకారుల అద్భుత ప్రదర్శనలు చూశాక ఆ మాటల్లో కొంత మాత్రమే వాస్తవం ఉందని అర్థమవుతోందన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలను నేటి తరమే విజయవంతంగా ముందుకు తీసుకెళ్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్థ స్థాపకుడు అశోక్ లాస్య నక్క అందరికీ స్వాగతం పలుకుతూ.. తమ అకాడమీ గత కొన్ని ఏళ్లుగా దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇస్తూ వస్తోందని తెలిపారు. విఖ్యాత ఆంధ్ర నాట్య గురువు డాక్టర్ నటరాజ రామకృష్ణ స్మృత్యర్థం ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ప్రముఖ సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ, జర్నలిస్ట్ సుమన్, గాయకుడు ప్రణయ్ కుమార్, అశ్విని, అయేషా తదితరులు పాల్గొని కళాకారులను అభినందించారు.

## రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడి ఎన్నికల బరిలో ఇద్దరు అభ్యర్థులు

### -23న రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఎన్నికలు



సమావేశంలో పాల్గొన్న అసిస్టెంట్ ఎన్నికల అధికారి జై కిషన్, తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమసంఘం ప్రతినిధులు

**చార్మినార్, జూలై 12 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడి ఎన్నికలకు సోమవారం నామినేషన్ల ఉప సంహరణ పూర్తి కావటంతో ఇద్దరు అభ్యర్థులు మాత్రమే పోటీలో ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు నాయి కోటి రాజు (సంగారెడ్డి), రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం మాజీకోశాధికారి పాడేపల్లి నాగరాజు (నల్గొండ) యాదాద్రి జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు రమేష్, ఖమ్మం జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ జానీమియాలు రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘంఅధ్యక్షుడి పదవి కోసం తమ నామినేషన్లు దాఖలు చేశారు. కాగా సోమవారం రమేష్, షేక్ జానీమియాలు తమ నామినేషన్లను ఉప సంహరించుకున్నారు. ఎన్నికల అసిస్టెంట్ అధికారి ఈ.జై కిషన్ మాట్లాడుతూ నలుగురు అభ్యర్థులు నామినేషన్లు వేయగా ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని తెలిపారు. మాజీ అధ్యక్షులు నాయి కోటి రాజు, మాజీ కోశాధికారి పాడేపల్లి నాగరాజులు ఎన్నికల పోటీలో ఉన్నారని ఈ నెల 23వ తేదీన తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమం సంఘం అధ్యక్షుడి పదవికి ఎన్నికలు జరుగుతాయని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి సంజీవి రెడ్డి, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లిఖార్జున్ గౌడ్, మాజీ ఉపాధ్యక్షులు పుస్తె శ్రీ కాంత్, కె.ఎ.లక్ష్మీ కుమారి, ప్రతినిధులు ఇంద్రజీత్ గుప్తా, మనోజ్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. డిఎస్ఓ గుర్తింపు పొందిన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడి ఎన్నికల జరుగుతాయని పుస్తె శ్రీ కాంత్ వెల్లడించారు,

## బోనాల ఉత్సవాలకు మౌలిక సదుపాయాలు : జెడ్సి శ్రీనివాస్‌రెడ్డి



బోనాల ఊరేగింపు మార్గాన్ని అధికారులు, ఆలయ ప్రతినిధులతో కలిసి పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

**చాంద్రాయణగుట్ట, జులై 13, ప్రభాతవార్త :** బోనాల పండుగకు అవసరమైన మౌళిక సదుపాయాలను బల్దియా కల్పిస్తుందని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జోన్, సర్కిళ్లలోని అధికారుల సమన్వయ పరచి సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. సోమవారం ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, హార్టికల్చర్ తదితర విభాగాల అధికారులు, ఉమ్మడి, ఆలయాల ప్రతినిధులతో కలిసి జంగమ్మెట్, చాంద్రాయణగుట్ట సర్కిళ్లలోని అమ్మవారి ఆలయాల వద్ద సమస్యలను తెలుసుకున్నారు. ఉప్పుగూడ మహంకాళి దేవాలయం నుండి ఊరేగింపు మార్గాన్ని పరిశీలించారు. ఉమ్మడి అధ్యక్షులు ఎం.మధుసూదన్‌యాదవ్, ఉప్పుగూడ మహంకాళి ఆలయ అధ్యక్షులు జె.మధుసూదన్‌గౌడ్ తదితరులు రోడ్డు నిర్మాణం, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్యం, తాగునీరు వంటి సమస్యలను జెడ్సి, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన సదుపాయాలు కల్పించాలని కోరారు. జెడ్సి పర్యటనలో జోన్ ఎస్ఇ నరేందర్‌గౌడ్, ఎలక్ట్రికల్ ఇఇ శ్రీనివాస్‌రెడ్డి, హార్టికల్చర్ ఇఇ విష్ణు, ఎఇలు ఆర్తి గౌడ్, చిట్టిబాబు, ఆలయాల ప్రతినిధులు ఉన్నారు. అంతకుముందు జెడ్సి శ్రీనివాస్‌రెడ్డికి, అధికారులకు ఆలయ అధ్యక్షులు మధుసూదన్‌గౌడ్, కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన వారు రానున్న బోనాల ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.

## కొత్త స్థంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి: కావలి గణేష్



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**దుండిగల్, జూలై 13, ప్రభాతవార్త** 296వ డివిజన్ పరిధిలో దెబ్బతిన్న, వంగిన, రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్థంభాలను తొలగించి, అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేయాలని కోరుతూ దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు సోమవారం టీఎస్ఎస్‌పీడీసీఎల్/ట్రాన్స్‌కో జీడిమెట్ల కార్యాలయంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ (ఏడీఈ)కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ వీరబత్తిని నరేందర్ గౌడ్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, దొంతి మహేష్ ముదిరాజ్, దత్తు రాజ్ యాదవ్ మాట్లాడుతూ 296వ డివిజన్ పరిధిలోని దుండిగల్ గ్రామం, నాగులూరు గ్రామం, దుండిగల్ తండా-1, దుండిగల్ తండా-2, గగిల్లాపూర్ గ్రామం, చర్చ్ గగిల్లాపూర్, 214 కాలనీ, శంభిపూర్ గ్రామం, మహేశ్వరం గ్రామం, కేవీఆర్ కాలనీ ప్రాంతాల్లో అనేక విద్యుత్ స్థంభాలు శిథిలావస్థకు చేరుకుని వంగిపోవడం, కొన్ని పూర్తిగా దెబ్బతినడం, మరికొన్ని రోడ్డుకు అడ్డంగా ఉండడం వల్ల ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు, పాదచారులు ఈ స్థంభాల కారణంగా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. వర్షాకాలంలో బలమైన గాలులు, భారీ వర్షాలు కురిసే సమయంలో దెబ్బతిన్న విద్యుత్ స్థంభాలు కూలిపోయే ప్రమాదం మరింత పెరుగుతుందని, దీనివల్ల ప్రాణనష్టం, ఆస్తినష్టం సంభవించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్థంభాలను తొలగించాలని కోరారు. అలాగే అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఏడీఈ సమస్యను పరిశీలించి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి సస్పెండ్

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 13, ప్రభాతవార్త** బెదిరింపులు అక్రమ వసూళ్ల ఆరోపణలు ఎదుర్కొన్న కెపిహెచ్‌బి కాలనీకి చెందిన కూకట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి పార్టీ అధిష్టానం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బి.ఆర్.ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీకి దూరంగా ఉండి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో తెరపైకి వచ్చిన శేరి సతీష్ రెడ్డి పలు రకాల సెటిల్మెంట్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా కెపిహెచ్‌బి కాలనీ, బాలాజీ నగర్, ఆల్విన్ కాలనీ డివిజన్ల పరిధిలో బిల్డర్లను బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు, అంతేకాకుండా వ్యక్తిగతంగా గృహాలు నిర్మించుకునే వారిని సైతం బెదిరిస్తూ అధికారులను మీడియాను మేనేజ్ చేస్తానంటూ లక్షల్లో డబ్బులు దండుకున్నట్లు అధిష్టానం దృష్టికి వచ్చింది. కొంతమంది బిల్డర్లు అడిగినంత డబ్బు ఇవ్వని పక్షంలో వారి బిల్డింగ్లను సీజ్ చేయించడం, వేధింపులకు గురిచేయడం వంటివి శేరి సతీష్ రెడ్డి చేయడంతో కూకట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని గ్రహించిన సీనియర్ నేతలు విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా వేధింపుల కారణంగా శేరి సతీష్ రెడ్డిపై కూకట్‌పల్లి, ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్లలో పలు సెక్షన్ కేసులు కూడా నమోదయ్యాయి. అధిష్టానం పలు రకాలుగా వివరాలు సేకరించిన నేపథ్యంలో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ సతీష్ రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు, ప్రాథమిక సభ్యత్వాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

### సచివాలయానికి బయలుదేరిన బిఆర్ఎస్ నేతల అరెస్టు



సీఎంకు వ్యతిరేకంగా ప్లకార్డులతో పోలీసుస్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్ నేతలు

**చాంద్రాయణగుట్ట, జులై 13, ప్రభాతవార్త :** రక్త పిశాచి రేవంత్..మా రక్తం తీసుకొని, రైతులకు నీళ్ల ఇవ్వు...అంటూ ప్లకార్డులు పట్టుకొని బిఆర్ఎస్ నేతలు నిరసన తెలిపారు. సోమవారం ఫలక్‌నుమా నుండి రాష్ట్ర సచివాలయానికి బయలుదేరిన నేతలను ఫలక్‌నుమా పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నేత ఎస్. గిరిధర్ నాయక్ మాట్లాడుతూ సీజన్లో రైతులకు నీళ్ల ఇవ్వకుండా మీనా మేషాలు లెక్కిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ రక్తం తీసుకోనైన పంటలకు నీళ్ల ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పడాల సతీష్, నాయకులు జంగయ్య, షఫీ, శ్రవణ్, సాయితేజ, గిరీష్, హెచ్‌సియు ఉపాధ్యక్షులు యుగంధర్ పాల్గొన్నారు.

### ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి: కలెక్టర్



పింకేష్ కుమార్‌తో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ మను చౌదరి

**జీడిమెట్ల, జూలై 13, ప్రభాతవార్త** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సుభాష్‌నగర్ వార్డు కార్యాలయంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలతో మాట్లాడిన ఆయన, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, పూరించిన ఫారాల స్వీకరణలో పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఓటర్లకు ఫారాల నింపే సమయంలో తలెత్తే సందేహాలను నివృత్తి చేస్తూ, సరైన అవగాహన కల్పించాలని, ఫారాల స్వీకరణతో పాటు వాటిని వెంటనే డిజిటలైజేషన్ ప్రక్రియలో నమోదు చేయాలని బీఎల్‌వోలకు ఆదేశించారు. అనంతరం కొంపల్లిలో కొనసాగుతున్న ఎన్యుమరేషన్, డిజిటలైజేషన్ ప్రక్రియలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ మను చౌదరి సూచించారు.

### పాత పద్ధతిలోనే వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలి

- రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా



పాత పద్ధతిలోనే వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలని గండిపేట పోస్టాఫీస్ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న నర్సిహ్మా.

**నార్సింగి, జూలై 13 ప్రభాతవార్త :** పాత పద్ధతిలోనే వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా పేర్కొన్నారు. ఎవరి గ్రామాల్లో వారికి పింఛన్లు ఇవ్వాలని కోరుతూ సోమవారం గండిపేట పోస్టాఫీస్ అధికారులకు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా నర్సిహ్మా మాట్లాడుతూ 3-15. కిలోమీటర్ల దూరం నుంచి గండిపేట పోస్టాఫీస్‌కు వచ్చి పింఛన్లు తీసుకోవడం వృద్ధులకు భారం అవుతుందన్నారు. నడువడానికి కష్టపడే వృద్ధులు రెండు, మూడు బస్సులు ఎక్కి గండిపేట వరకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆటోలలో వచ్చే వారు తమకు వచ్చిన పింఛన్ డబ్బులన్నీ చార్జీలకే ఇవ్వాల్సి వస్తుందన్నారు. గతంలో ఎవరి గ్రామాల్లో వారికి పింఛన్లు పంపిణీ చేసే వారని, అదే పద్ధతిలో మళ్లీ పింఛన్లు ఇస్తే వృద్ధులకు మేలు జరుగుతుందని పోస్టాఫీస్ అధికారులను కోరినట్లు తెలిపారు. వృద్ధుల ఇబ్బందులను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి వచ్చే నెల నుంచి ఎవరి గ్రామాల్లో వారికి పింఛన్లు పంపిణీ చేసేందుకు కృషి చేస్తామని అధికారులు సోమ్యా సాహూ, ఇందిరాలు హామీనిచ్చారని రామేశ్వరం నర్సిహ్మా వివరించారు.

### దొంగతనానికి పాల్పడిన పాత నేరస్థుడి అరెస్ట్

**గన్‌ఫౌండ్రి, జూలై 13ప్రభాతవార్త:** వ్యాపార వేత్త వద్ద డ్రైవర్‌గా కొనసాగుతున్న ఓపాత నేరస్థుడి ఏకంగా5లక్షల50వేల నగదును తస్కరించి తప్పించుకు తిరుగుతుండగా సుల్తాన్‌బజార్ పోలీసులు చాకచాక్యంగా అదుపులోకి తీసుకుని 5లక్షల4వేల 900 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ నరేష్, డిఐ ధర్మారావుతో కలిసి సుల్తాన్‌బజార్ ఎ.సి.పి మట్టయ్య మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం చౌదూర్ గ్రామానికి చెందిన కుతాడి హరికుమార్(34), వ్యాపారవేత్త దయారామ్‌ప్రజాపత్‌వద్ద డ్రైవర్‌గా కొనసాగుతున్నాడు. అయితే ఈనెల 9వ తేదిన కోఠి బ్యాంకుస్ట్రీట్ వద్ద యాజమాన్ని షాపింగ్‌వెళ్లాడు. కారులో ఉన్న 5లక్షల 50 వేల రూపాయలను దొంగతనం చేసుకుని ఉడాయించారు. షాపింగ్ వెళ్లి తిరిగి వచ్చిన కారు డ్రైవర్ హరికుమార్ కనిపించక పోవడంతో యాజమాని ప్రజాపత్ పలుసార్లుఫోన్ చేసిన స్పందిచక పోవడంతో ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకున్నాడు. చేసేది ఏమిలేక ప్రజాపత్ సుల్తాన్‌బజార్‌పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయమై లిఖిత పూర్వంగా ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని హరికుమార్ కోసం గాలింపు చేశారు. ఎట్టకేలకు షాద్‌నగర్ బస్‌స్టాండ్‌లో పట్టుబడిన హరికుమార్‌ను వెంటనే తీసుకుని స్టేషన్‌కు వచ్చి విచారించగా అతనిపై పలు పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదై ఉన్నట్లు తెలిసింది. అతని వద్ద5లక్షల 4వేల 900 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. న్యాయస్థానంలో హాజర్ పర్చగా రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును సుల్తాన్‌బజార్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇన్‌స్పెక్టర్లు నరేష్, ధర్మారావు, ఎస్ఐ సాయినాథ్‌లను ఎసిపి మట్టయ్య అభినందించారు.

### సైదాబాద్‌లో హిట్ అండ్ రన్..ముగ్గురికి గాయాలు

**సైదాబాద్, జూలై 13 ప్రభాతవార్త:** సైదాబాద్‌లో జరిగిన హిట్ రన్ కేసులో తల్లి, కూతురు, మనుమరాలికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కరణ్‌బాగ్‌కు చెందిన సుకన్య(65), కూతురు, చంద్రలేఖ(32), మనుమరాలు కనిష్క(6)లు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నమోదు కోసం సోమవారం మధ్యాహ్నం హోండా యాక్టీవా ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. గడ్డిఅన్నారంలోని రాఘవేంద్ర టిఫిన్ సెంటర్ వద్దకు రాగానే వేగంగా వచ్చిన బైక్ వీరిని ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ సంఘటనలో ముగ్గురు ద్విచక్రవాహనంపై నుండి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధికార ప్రతినిధిగా విజయ్ కుమార్



నియామకపు పత్రాన్ని అందుకుంటున్న విజయ్ కుమార్.

**వనస్థలిపురం. జూలై.13.ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా అర్బన్ బి.జె.పి.అధికార ప్రతినిధిగా వనస్థలిపురం కు చెందిన సీనియర్ నాయకుడు తడకమల్ల విజయ్ కుమార్ రెండవ సారి నియమితులయ్యారు.ఈ మేరకు బి.జె.పి.రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి నియామకపు ఉత్తర్వులు జారీచేశారు. అట్టి నియామకపు పత్రాన్ని వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి చేతులమీదుగా విజయ్ కుమార్ అందుకున్నారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పనిచేసే నాయకులకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు.సీనియర్ నాయకులు ,కార్యకర్తల సహకారంతో జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా బి.జె.పి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధి కి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ మేడ్చల్ ని యోజకవర్గ ప్రభారి సామ రంగారెడ్డి,జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లకు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు,సీనియర్ నాయకులు,బి.జె.పి.కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు యష్పాల్ గౌడ్,భాండారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్లను ఆధునికరించడానికి కృషి : డైరెక్టర్ మాదారం కృష్ణ



మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లో పర్యటిస్తున్న నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదారం కృష్ణ , సూపర్ వైజర్ పవన్ తదితరులు

**మలక్ పేట, జూలై 13, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధునికరించడానికి కృషి చేస్తున్నామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదారం కృష్ణ పేర్కొన్నారు. సోమవారం మలక్ పేటలో మార్కెట్ కమిటీ సూపర్వైజర్ పవన్, సిబ్బందితో కలిసి ఆయన పర్యటించి రైతులు, వ్యాపారస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్లో సరుకు చోరీకి గురవుతుందని పలువురు వ్యాపారస్తులు ఆయన దృష్టికి తీసుకురావడంతో మార్కెట్లో దొంగతనాలు జరుగకుండా చర్యలు చేపడుతామని తెలిపారు. మార్కెట్లో పోలీస్ ఔట్ పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు పటిష్టమైన భద్రతా చర్యలను చేపడుతామని తెలిపారు. రైతులకు మెరుగైన గిట్టుబాటు ధరలను కల్పించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. రైతులు, వ్యాపారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమం కోసం పాటుపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి: ఎమ్మెల్యే అహ్మద్ బలాల



ఎస్ఐఆర్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల తదితరులు

**మలక్ పేట, జూలై 13, ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్ పేట నియోజకవర్గం లోని పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ సహాయక కేంద్రాలను ఎమ్మెల్యే బలాల పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అహ్మద్ బలాల మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం మలక్ పేట నియోజక వర్గంలో చురుకుగా జరుగుతోందని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత ముఖ్యమై నదని, ప్రతి అర్హత కలిగిన వ్యక్తి తమ పేరు తప్పనిసరిగా జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. తమ పేర్లతో పాటు కుటుంబం లోని ప్రతి సభ్యుల పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వినియోగించుకుని ఓటర్లు తమ వివరాలను సరిచేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సదుపాయల కల్పనే లక్ష్యం : ఎమ్మెల్యే



సీసీ రోడ్డు శంకుస్థాపనలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.

**హయత్ నగర్, జులై 13 ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎల్ బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. లెక్చరర్స్ కాలనీ డివిజన్ దత్తాత్రేయ కాలనీ లో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి కనీస సదుపాయాలను కల్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు చెన్నగోని శ్రీధర్ గౌడ్,సింగిరెడ్డి మల్లీశ్వరి రెడ్డి, మల్లారెడ్డి, చంద్రారెడ్డి,రాంచంద్రారెడ్డి,పరమేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



**మల్కాజిగిరి జులై 13 ప్రభాతవార్త :** ఆనంద్ బాగ్ క్యాంపు కార్యాలయంలో 27 కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ దాదాపు 18 లక్షల రూపాయల చెక్కులను బాధితుల బంధువులకు కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్చార్జి లక్ష్మీకాంతరెడ్డి నియోజకవర్గ నాయకులతో కలసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ఆపదలో ఉన్న వారికి ఒక అభయ స్థమని మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో బాధితుల కుటుంబాలకు చెక్కులను అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ బీకే శ్రీనివాస్ గుండా నిరంజన్ జీఎన్వి సతీష్ కుమార్, వినోద్ యాదవ్,రాందాస్ సంతోష్ ముదిరాజ్,పార్థు, పాండు రంగ చారి,నరేష్, రామకృష్ణ, గ్యార ప్రవీణ్,షకీల్, తదితరులు పాల్గొన్నారు

# మణిదీప్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన దత్తాత్రేయ



మణిదీప్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ గవర్నర్ దత్తాత్రేయ

**వనస్థలిపురం. జూలై.13.ప్రభాతవార్త** ఇంజనీరింగ్ విద్యను అభ్యసించడానికి ఫిన్లాండ్ దేశానికి వెళ్లి అదృశ్యమైన మణిదీప్ రెడ్డి కుటుంబ సభ్యులను మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సోమవారం వైదేహినగర్ లోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మణిదీప్ రెడ్డి తల్లిదండ్రులు గుజ్జ ముత్యం రెడ్డి మమత దంపతులు తమ కుమారుడు మే నెల 5 న అదృశ్యం అయ్యాడని తెలిసిందని,తమ కుమారుడి మృతదేహం సముద్రంలో లభ్యమైందాని ఫిన్లాండ్ అధికారు లు ఎలా ధృవీకరిస్తారని ప్రశ్నించారు. తమ కుమారుడి మృతదేహం చూపించకుండా ఎలా నిర్ధారిస్తారని దత్తాత్రేయ దృష్టికి తీసుకువచ్చారు. తమ కుమారుడి ఆచూకీ కోసం తాము భారత ప్రభుత్వానికి మెయిల్ చేశామన్నారు.రెండు నెలల క్రితం తప్పిపోతే ,ఇప్పటివరకు ఫిన్లాండ్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకుండా,చివరకు మణిదీప్ మృతదేహం సముద్రంలో లభ్యమైందని ఎలా నిర్ణయిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ తమ కుమారుడు మృతి చెంది ఉంటే ,మృతదేహాన్ని అప్పగించాలని మాజీ గవర్నర్ ను కోరారు. మణిదీప్ కుటుంబ సభ్యుల ఆవేదన విన్న అనంతరం దత్తాత్రేయ భారత ఎంబసీ తో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు తెలిపారు. పరామర్శించిన వారిలో సామ రంగారెడ్డి, వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

## వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వికలాంగులైన మహిళలకు కేటాయించాలి : సుజాత సూర్యవంశీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పిఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ తదితరులు

**మలక్ పేట, జూలై 13, ప్రభాతవార్త:** వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ పదవిని వికలాంగులైన మహిళలకు కేటాయించాలని వీహెచ్పిఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. మలక్ పేట నల్గొండ చౌరస్తాలోని వికలాంగుల సహకార సంస్థ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరం సందర్భంగా 1981లో అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి అంజయ్య వికలాంగుల సహకార సంస్థ ఏర్పాటు చేసి మొట్టమొదటి చైర్మెన్ గా శ్రీమతి లక్ష్మీదేవిని నియమించడం జరిగిందని, నాటి నుంచి నేటి వరకు సుమారు 45 సంవత్సరాలుగా ఒక్క మహిళా వికలాంగురాలికి కూడా అవకాశం ఇవ్వకపోవడం మహిళా సమాజాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. మన పక్క రాష్ట్రంలో రాష్ట్ర విభజన తరువాత ఒక వికలాంగురాలైన మహిళకి అవకాశం కల్పించడం చాలా గర్వించదగ్గ విషయమని తెలిపారు. మన తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో ఉద్యమాలలో మా పాత్ర విడదీయలేనిదని, స్వరాష్ట్ర లక్ష్యంగా పలు ఉద్యమాలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. సకలాంగ మహిళలతో సమానంగా బోనం ఎత్తుకున్నమని, బతుకమ్మలు ఆడడం జరిగిందని వివరించారు. మా వికలాంగ మహిళామణుల పాత్ర వేల కట్టలేనిదని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి రెండున్నర సంవత్స రాలు అవుతున్న సందర్భంగా ఈసారి ఇచ్చే వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ పదవిని మహిళ వికలాంగులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో జాతీయ అవార్డు గ్రహీత, మాజీ సెన్సార్ బోర్డు సభ్యురాలు పుట్ట బత్తిని పద్మావతి, మహిళా వికలాంగుల సాధికారత సంఘం నాయకులు కొళ్ళ రాజ్యలక్ష్మీ, పొట్ట బత్తిని స్వప్న, పంతంగి మంగమ్మ, సభావత్ సైదయ్య, కొప్పు ఇందిరా, గీతమ్మ, సమీప, బండారి లక్ష్మి, బి. రాజీత, శోభ తదితరులు పాల్గొన్నారు. కాగా రంగారెడ్డి జిల్లా డిసేబుల్డ్ కో కన్వీనర్ పబ్బ కరుణాకర్ వారికి మద్దతు తెలిపారు.

# రాఘవేంద్రకాలనీకి రూ.80లక్షల నిధులు : పరమేశ్వర్‌రెడ్డి



ఉప్పల్ రాఘవేంద్రకాలనీ నేతలకు నిధుల మంజూరు పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జూలై 13 ప్రభాతవార్త :** ఉప్పల్ బీరప్పగడ్డ డివిజన్‌లోని రాఘవేంద్ర కాలనీ గణేష్ దేవాలయం సమీపంలో రిటైనింగ్ వాల్, స్టీల్ గిర్డర్ వంతెన నిర్మాణానికి రూ.80లక్షల నిధులు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం నిధుల మంజూరు పత్రాలను బీరప్పగడ్డ డివిజన్ అధ్యక్షుడు ఆకిటి ఆగంరెడ్డితో కలిసి కాలనీ సంఘం నేతలకు అందజేశారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని కాలనీలలో అభివృద్ధి పనులను చేపడుతూ సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు.ఈ నిధులతో రిటైనింగ్ వాల్ నిర్మాణంతో కాలువ ఒడ్డు బలపడటంతో పాటు నేల కోతను నివారించవచ్చున్నారు. భారీ వర్షాల సమయంలో సమీప రహదారులు, నివాస ప్రాంతాలకు రక్షణ కల్పించబడుతుందన్నారు. అలాగే, స్టీల్ గిర్డర్ వంతెన నిర్మాణం ద్వారా పాదచారులు, వాహనాల రాకపోకలు సురక్షితంగా, సౌకర్యవంతంగా సాగేందుకు అవకాశం కలుగుతుందని చెప్పారు.ఈ అభివృద్ధి పనులు స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించడంతో పాటు ప్రాంత అభివృద్ధికి, ప్రజల భద్రతకు మరియు సౌకర్యాలకు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఆగం రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చెన్ రెడ్డి రఘుపతి రెడ్డి, రాజేష్ ముదిరాజ్, మహేష్ ముదిరాజ్ మరియు కాలనీ నేతలు గంగాధర్ గౌడ్, అజయ్ కుమార్ గుప్తా,, సుధాకర్ రెడ్డి, రాజేశ్వర్ రావు, మురళీ కృష్ణ, కిరణ్, భట్కిరి జంగయ్య, మల్లేష్ యాదవ్, వేణు గోపాల్ పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు వైద్య విద్య అందించిన దార్శనికుడు బీఎస్ రావు



బిఎస్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీచైతన్య స్కూల్ సిబ్బంది

**నాచారం, జులై 13 ప్రభాతవార్త :** పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే మహోన్నత సంకల్పంతో శ్రీ చైతన్య విద్యాసంస్థలను స్థాపించిన వ్యవస్థాపకులు బీఎస్ రావు విద్యారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని నాచారం సీబీఎస్సీ శ్రీ చైతన్య పాఠశాల నిర్వాహకులు కొనియాడారు. ఆయన దూరదృష్టి, విద్యా పట్ల అంకితభావం వల్ల వేలాది మంది విద్యార్థులు వైద్యులుగా, ఉన్నత స్థాయి నిపుణులుగా ఎదిగారని పేర్కొన్నారు. బీఎస్ రావు మూడో వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం నాచారం సీబీఎస్సీ శ్రీ చైతన్య పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అడ్మిన్ ప్రిన్సిపల్ ఆర్. వెంకట్, ఆర్ఐ బండి వెంకటేష్, అకాడమిక్ డీన్ రాజేంద్ర ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ టీ. మల్లికార్జున్, అకాడమిక్ ప్రిన్సిపల్ షారన్ జ్యోతి తదితరులు బీఎస్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యను సామాన్యులకు చేరువ చేసి ప్రతిభకు అవకాశాలు కల్పించడంలో బీఎస్ రావు చేసిన కృషి ఆదర్శప్రాయమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆయన వేసిన బలమైన పునాదులే నేడు శ్రీ చైతన్య విద్యాసంస్థలను దేశవ్యాప్తంగా విశ్వసనీయ విద్యాసంస్థగా నిలబెట్టాయని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## బిజెపికి రోజు రోజుకీ ఆదరణ పెరుగుతోంది : అందెల శ్రీరాములు యాదవ్



ప్రసంగిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, జులై 13 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో బిజెపికి రోజు రోజుకీ ఆదరణ పెరుగుతున్నదని నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ లోని ప్రశాంతిహిల్స్ డివిజన్ జనప్రియా, అయోధ్యనగర్ కాలనీలకు చెందిన పలువురు స్థానికులు జిల్లా బిజెపి కార్యదర్శి పాలమూరి విజయలక్ష్మి రాజు ఆధ్వర్యంలో అందెల శ్రీరాములు యాదవ్ సమక్షంలో బిజెపిలో చేరారు.ఈ సందర్భంగా ఆయన పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి స్వాగతించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా బిజెపి ఎదుగుతున్నదని అన్నారు.కార్యక్రమంలో మీర్‌పేట్ సెక్టార్ బిజెపి అధ్యక్షుడు పస్నూరి బిక్షపతిచారి,ఇంద్రావత్ రవినాయక్,రవీందర్‌గౌడ్,నాగభూషణం పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

**హయత్ నగర్, జులై 13 ప్రభాతవార్త :** ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.... హయత్ నగర్ ప్రాంతం సూర్య నగర్ కాలనీకి చెందిన చౌడబోయిన ఆదినారాయణ(35) వృత్తి రిత్యా కూలి. సోమవారం ఉదయం ఆటోనగర్లో ఇసుక పనికి వెళ్లి మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటికి తిరిగి వస్తుండగా కనకదుర్గ బార్ అండ్ రెస్టారెంట్ దాటిన తర్వాత వినాయక నగర్ కాలనీ సమీపంలో సర్వీస్ రోడ్డులో ఆర్టీసీ బస్సు అతని ద్విచక్ర వాహనాన్ని వెనుక నుండి బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన ఆదినారాయణ తలమీదుగా బస్సు వెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పుణ్యవతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉప్పల్ ఆర్యవైశ్య సంఘం కొత్త కార్యవర్గం



ఉప్పల్ ఆర్య వైశ్య సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో ప్రసంగిస్తున్న ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ గుప్తా తదితరులు

**ఉప్పల్, జూలై 13 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అనుబంధ సంస్థ అయిన ఉప్పల్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం ఉప్పల్ సౌత్ స్వరూప్ నగర్ కాలనీలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన దేవాలయంలో సంఘం గౌరవ అధ్యక్షులు బిక్కుమళ్ళ రమేష్ గుప్తా, సుధాకర్‌గుప్తా ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. సంఘం నూతన అధ్యక్షులుగా బిక్కుమళ్ళ సంతోష్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా పాలడుగు సంతోష్ గుప్తా, కోశాధికారిగా రేణికుంట కిరణ్ కుమార్ గుప్తాతో పాటు నూతన కార్యవర్గ సభ్యులు పదవీ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీ నారాయణ గుప్తా ముఖ్య అతిదిజగా హాజరై నూతన కార్యవర్గానికి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజ ఐక్యత, సేవాభావం, యువత భాగస్వామ్యంతో ఆర్యవైశ్య సంఘాలు మరింత బలోపేతం కావాలని ఆయన ఆకాంకించారు. అదేవిధంగా రాష్ట్ర నాయకులు కొండ్లె మల్లికార్జున్‌గుప్తా, గణేష్ గుప్తా, అగిర్ వెంకటేష్ గుప్తా, నేతి రాములు గుప్తా తదితరులు పాల్గొని సభ్యులను అభినందించారు. విశిష్ట అతిదులు జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బెలిదె రమేష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి బచ్చు నగేష్ కుమార్ గుప్తా, కోశాధికారి బల్లి శ్రీధర్ గుప్తా, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్ గుప్తా, రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గందె సురేష్ గుప్తా పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ, సమాజ అభివృద్ధి, విద్య, సేవా కార్యక్రమాలు, యువత ప్రోత్సాహానికి ప్రాధాన్యతనిస్తూ సంఘాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య బంధువులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## మల్లికార్జున నగర్‌లో యుఎల్‌సి సమస్య పరిష్కరించాలి



**మల్కాజిగిరి జులై 13 ప్రభాతవార్త :** గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్ లో నెలకొన్న యు ఎల్ సి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ మల్లికార్జున కాలనీవాసులు సోమవారం మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డిని తన నివాసంలో కలిసి కోరారు. మల్లికార్జున నగర్ లో సుమారు 170 ఇండ్లు యూఎల్సి లో ఉన్నాయని గత 40, 50 సంవత్సరాలుగా ఈ సమస్య తమకు తీవ్రంగా ఇబ్బంది కలిగిస్తుందని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మల్లికార్జుననగర్ కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఇటీవలే మల్కాజ్గిరి లో దీర్ఘకాలికంగా నెలకొన్న యూఎస్ సమస్య పరిష్కారం చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశామని మల్కాజ్గిరి నియోజకవర్గంలో ఉన్న సమస్య పరిష్కారానికి చర్యలు చూపుతాం అని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కాలనీవాసులకు తెలిపారు త్వరలో యూఎస్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు మేకల రామ యాదవ్ మల్లికార్జున కాలనీవాసులు వెంకటయ్య ,అచ్యుత రావు, గోపాల్ రెడ్డి,సత్యనారాయణ, రాజలిగాం, శేషు బాబు,మనోహర్ ,ఎస్వీఆర్ వెంకట్, భాను, కిషాన్, మరియు ఇతర నాయకులు ఉన్నారు,

## రూ.కోటి 80లక్షలతో స్మశానవాటికల అభివృద్ధి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి సత్కరిస్తున్న ఉప్పల్ గౌడ సంఘం నేతలు

**ఉప్పల్, జూలై 13 ప్రభాతవార్త :** ఉప్పల్ బీరప్ప గడ్డ డివిజన్‌లోని గౌడ్, ముదిరాజ్, కుమ్మరి సంఘం స్మశానవాటికల అభివృద్ధికి రూ.కోటి 80లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్‌కు చెందిన పలువురు గౌడ సంఘం నేతలు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బన్నాల ప్రవీణ్‌ను కలిసి సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి తను కట్టుబడి ఉన్నానని, రూ.45 లక్షలతో స్మశానవాటిక నిర్మాణ పనులు మొదలు పెడతారని, దశలవారీగా మొత్తం 1 కోటి 80 లక్షల రూపాయలతో మోడల్‌గా తీర్చి దిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ గౌడ సంఘం నేతలు బజారు కృష్ణ గౌడ్, బింగి బిక్షపతి గౌడ్, బింగి శ్రీరాములు గౌడ్, బజార్ మురళీకృష్ణ గౌడ్, పొటగని బాలరాజు గౌడ్, నేర్ధం భాస్కర్ గౌడ్, బూత్కూర్ సాయి కుమార్ గౌడ్, మించ కృష్ణ గౌడ్, బందారం రాముగౌడ్, బింగి భరత్ గౌడ్, పంజాల శ్రవణ్ కుమార్ గౌడ్ ,బద్దం జ్ఞానేశ్వర్ గౌడ్, బందారం లక్ష్మణ్ గౌడ్, బూత్కూరి నవీన్ గౌడ్, బూత్కూరి గణేష్ గౌడ్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌లో ప్రజలకు అండగా బిఆర్ఎస్



కార్యక్రమంలో పాల్గొన్న చంద్రశేఖర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూలై 13 ప్రభాతవార్త:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా శ్రీచైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గణేష్‌పురి, న్యూఎంసీహెచ్, మున్సిపల్‌కాలనీ ప్రాంతాల ప్రజలకు ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో స్థానికులకు అవసరమైన పత్రాల పరిశీలన, దరఖాస్తుల పూరణ (పేపర్‌వర్క్)లో సహాయం చేసి, పూర్తి చేసిన ఫారాలను సంబంధిత బీఎల్‌వోలకు సమర్పించేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసుకునేలా బీఆర్ఎస్ నాయకులు సహకారం అందించారు. కార్యక్రమంలో సాయిప్రశాంత్, రామకృష్ణ, జలంధర్, రమేష్, పులి కిరణ్, శ్రీకాంత్ ,శ్రవణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు జాబితాలో అర్హులు ఉండేలా నాయకులు కృషి చేయాలి : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూలై 13 ప్రభాతవార్త:** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నివాసంలో మాజీ కార్పొరేటర్లు, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో ముందుగానే నియోజకవర్గ పరిధిలో పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రతికాలనీలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించడం జరిగిందని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణల కోసం అవసరమైన పత్రాలను సకాలంలో సమర్పించాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత ఎన్నికల అధికారులను వెంటనే సంప్రదించాలని సూచించారు.ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని, ప్రతిఒక్కరూ తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించి అవసరమైన సవరణలు చేయించుకోవాలని సూచించారు.

## జిల్లా బిజెపి అధికార ప్రతినిధిగా అవినిష్ రెడ్డి



జిల్లా బిజెపి అధికార ప్రతినిధి అవినాష్‌రెడ్డికి, ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి రాజేష్‌లకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

**సైదాబాద్, జులై 13 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా (అర్బన్) భారతీయ జనతాపార్టీ అధికార ప్రతినిధిగా ఎల్‌బినగర్ నియోజకవర్గం చంపాపేట డివిజన్‌కు చెందిన గూడూరు అవినిష్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో బిజెపిని మరింత బలోపేతం చేయడానికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. గత 16 సంవత్సరాలుగా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్నానని, తనపై నమ్మకం ఉంచి జిల్లా అధికార ప్రతినిధిగా నియమించిన జిల్లా బిజెపి అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బండారు భాస్కర్, యష్పాల్ గౌడ్‌లకు ఆయన ధన్యావాదాలు తెలిపారు.

## జిల్లా ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శిగా రాజేష్



టింగ్లికార్ రాజేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న జిల్లా బిజెపి అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి

**సైదాబాద్, జులై 13 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా (అర్బన్) భారతీయ జనతాపార్టీ ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శిగా చంపాపేట డివిజన్‌కు చెందిన సీనియర్ నాయకులు టింగ్లికార్ రాజేష్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేశారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బిజెపిని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు. పార్టీ అధిష్టానం చేపట్టే అన్ని కార్యక్రమాలు జిల్లాలో విజయవంతం అయ్యేలా తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. కాగా టింగ్లికార్ రాజేష్ గతంలో బూత్ అధ్యక్షుడిగా, వార్డు అధ్యక్షుడిగా, చంపాపేట డివిజన్ బిజెపి అధ్యక్షుడిగా, రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యుడిగా, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం



చెక్కును అందజేస్తున్న లోకసాని కొండల్‌రెడ్డి

**హుడాకాంప్లెక్స్,9 జులై, ప్రభాతవార్త :** నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఇక వరంలాంటిదని మాజీ విద్యాశాఖ మంత్రి , మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. సరూర్‌నగర్ డివిజన్‌కు చెందిన ముగ్గురు నిరుపేదలు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఆర్థిక సహాయం కొరకు లోకసాని కొండల్‌రెడ్డిని సంప్రదించారు. ఈ విషయాన్ని అయన సబితాఇంద్రారెడ్డి దృష్టికి తీసుకునివెళ్లారు. అమె సిఎం సహాయనిధికి ధరఖాస్తులను పంపించారు. వారి ధరఖాస్తుల పరిశీలన అనంతరం సిఎం సహాయనిధి నుండి వారికి చెక్కులను మంజూరు చేశారు. మంజూరైన ఇట్టి చెక్కులను సోమవారం ఎమ్మెల్యే అదేశాల మేరకు ముగ్గురు నిరుపేదలైన కృష్ణ భాస్కర్ (కూతరు అరాధ్య)కు రూ. 60,000/, ఎడ్ల రాములమ్మకు రూ.17000/, ప్రశాంత్‌కు రూ.23000/ చెక్కులను లోకసాని కొండల్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌని శ్రీనివాస్‌గౌడ్, రాగం సునిల్‌యాదవ్, కిరణ్‌కుమార్, తేజ, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన చంద్రశేఖర్‌రెడ్డికి సన్మానం



చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానించిన చల్లా నర్సింహారెడ్డి, జిల్లెల నరేందర్‌రెడ్డి, సిద్దాల దశరథ

**సరూర్‌నగర్, జూలై 13 ప్రభాతవార్త:** ఉపాధ్యాయ వృత్తిలో సుదీర్ఘ కాలం పాటు పని చేసి సేవలందించి పదవీ విరమణ పొందిన జిల్లెలగూడ గాయత్రీనగర్‌కు చెందిన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డిని జిల్లెలగూడ గ్రామానికి చెందిన ప్రముఖులు టియుఎఫ్ఐడిసి ఛైర్మన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, సరూర్‌నగర్ మాజీ జడ్పీటిసి జిల్లెల నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి సిద్దాల దశరథలు ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ అభినందన సభకు హాజరైన వారు చంద్రశేఖర్‌రెడ్డిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రశేఖర్‌రెడ్డి శేష జీవితం ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో సాగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ చల్లా బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్లకు బిఎల్ఓలు, బిఎల్ఎలు సహకరించాలి : యెల్మేటి అమరేందర్‌రెడ్డి



**సరూర్‌నగర్, జులై 13 ప్రభాతవార్త:** అర్హులైన ఓటర్లు ఎస్ఐఆర్‌లో నమోదు కావడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని టిపిసిసి కార్యదర్శి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి సూచించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి బాలాపూర్ డివిజన్‌లో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సందర్భంగా ఆయన బిఎల్ఓలతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన బిఎల్ఎలతో కలిసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన వారితో సమావేశమై అర్హులైన ఏ ఓటరు ఎస్ఐఆర్‌లో మిస్ కాకుండా చూడాలని సూచించారు. ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా పూరించే విధంగా సహకరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఛైర్మన్ క్యారగారి శ్రీధర్, నాయకులు ఎర్ర సుదర్శన్, బిఎల్ఏ వంగేటి మధుసూదన్‌రెడ్డి, రావుల లింగం, మేకల కిరణ్, మహేందర్, యువ నాయకులు చింతకింది భాను, సాయి, దిలీప్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.